పెళ్ళి ముహూర్తం పదిరోజుల్లోకి వచ్చినప్పుడు అనుకోని సంఘటన జరిగింది!

అమ్మ హడావుడిగా పెరట్లోకి వెళ్తున్నప్పుడు... కాలు మెలి తిరిగినట్లయి... మెట్టుమీద నుండి జారి క్రిందకు పడిపోయింది.

కట్టు కట్టటం లాంటి వైద్యం పూర్తయ్యాక...రెండు వారాలు పాటు మంచం దిగ కూడదని డాక్టరు చెప్పేసరికి అయోమయంగా అనిపించింది!

ఏం చేయాలో తోచని పరిస్థితి...!

పెళ్ళి వాయిదా వేద్దామనే ఆలోచనకు అమ్మ నన్ను కోప్పడింది.

'నేనే అన్ని పనులూ చేస్తానా... అందరూ ఉన్నారుగా, పెళ్ళి వాయిదా వేయటం నాకు సుతరామూ ఇష్టంలేదు...' అని గట్టిగా చెప్పేసింది.

ఏ నిర్ణయమూ తీసుకోలేని పరిస్థితి నాదయింది...!

ఈ కబురు తెలిసి మాధవీ వాళ్ళ తల్లిదండ్రులతో పాటు, మరికొందరు అమ్మని చూడటానికని వచ్చారు. 'కోడలు రాబోయేవేళ' మంచిది కాదనుకుని పెళ్ళిని కాన్సిల్ చేసుకుంటా మేమోనన్న సందేహం వాళ్ళకు కలిగినట్లుంది. అది బయటకు చెప్పగానే, అలాంటి మూర్ఖత్వపు ఆలోచనలు మాకు రావని అమ్మ, నేనూ తేల్చి చెప్పాం!

దాంతో వాళ్ళు కొంత ఊరటపడినట్లుగా కనిపించారు.

కాసేపు ఏవో జాగ్రత్తలు చెప్పి, పెళ్ళి వాయిదా వేయాలనుకున్నా, తమకేమీ అభ్యంతరం ఉండదనే విషయాన్నీ తెలియజేసి, వెళ్ళిపోయారు.

ఆ తరువాత ఇంకో విచిత్రం జరిగింది!

రెండు రోజుల తర్వాత మాధవీ వాళ్ళ ఊరి అబ్బాయి ఒకడు 'అక్క మీకీ ఉత్తరం ఇచ్చి రమ్మంది' అంటూ ఓ కవరు నా చేతికి ఇచ్చాడు.

అమ్మకి ఇలా జరిగిందని... నన్ను పరామర్శిస్తున్నట్లుగా ఏదో రాసి ఉంటుందనుకున్నా కానీ ఆ ఉత్తరంలో రెండే రెండు వాక్యాలు ఉన్నాయి.

ఆ మరునాడు నన్ను కలవటానికి తను మా ఇంటికి వస్తోంది కాబట్టి నన్ను వేరే

పనేమీ పెట్టుకోకుండా ఇంటివద్దే ఉండమని కోరుతున్నట్లు రాసింది.

అమ్మని చూసి, నన్ను పలుకరించి పోదామని వస్తోందని ఆ రోజు ఉదయం నుండి మాధవి రాకకోసం ఎదురుచూస్తూ ఉన్నాను.

మాధవి వెంట వచ్చిన వాళ్ళను చూసి తబ్బిబ్బు పడ్డాను. తానొక్కతే కాకుండా వాళ్ళ అమ్మానాన్నలతో పాటుగా పెద్దమ్మ, పెదనాన్నలు... మరి నలుగురు నాకు తెలియని వాళ్ళూ ఉన్నారు. వాళ్ళవెంట పురోహితుడూ, ఏదో సరంజామా కూడా ఉండటంతో... విషయం ఏమిటో కొంచెంగా ఊహించగలిగాను.

'ఇదేమిటీ... ఇలా...?' మాధవిని ప్రశ్నిస్తే... తన అభిప్రాయాన్ని వివరించింది. 'పెళ్ళి ఇంకా వాయిదా వేయటం ఎందుకనిపించింది. మీదీ, మీ అమ్మగారిదీ అభిప్రాయాలు మా వాళ్ళు చెప్పాక... నేనే స్వంతంగా ఈ నిర్ణయం తీసుకున్నాను. మీతో సంప్రదించకపోవటం కరెక్టు కాదేమోగానీ, ఇలా చేయటమే మంచిదనిపించింది! అనుకున్నట్లుగా సత్రంలో బోలెడంత మంది బంధుమిత్రుల మధ్య కాకుండా, ఇప్పుడే ముందుగానే మీ ఇంటిలో... మీ అమ్మగారి కళ్ళముందే మన పెళ్ళి జరగబోతోంది!

మావాళ్ళ సంతృప్తి కోసం... మంచి రోజు, ముహూర్తం లాంటివన్నీ నిర్ణయించటం జరిగింది. లేకపోతే, రెండు పూలదండలతో నేను మాత్రమే వచ్చేసి ఉండేదాన్ని!

ఇలా పెళ్ళి అయిపోతే... అప్పుడిక ఈ ఇంట్లో కోడలుగా ఉండి ఇంటిపనులు, అత్తయ్యకీ మీకు తోడుగానూ ఉండి చూసుకోవటం బావుంటుందనిపించింది! నా నిర్ణయాన్ని మీరూ అంగీకరిస్తారనే భరోసా ఉండటంతో ఇలాంటి పనికి ధైర్యం చేసాను...!'

నాకూ ఆ ఏర్పాటు నిజానికి ఆనందమే కలిగించింది తప్ప ఇబ్బంది కలగలేదు! పైగా అంత మంచి నిర్ణయాన్ని అలా అమలు చేస్తున్నందుకు, మనసులోనే మెచ్చుకుని, కళ్ళతోనే తనని ప్రశంసించాను కూడా!

ఆలోచిస్తే... నాకో విషయం అర్థమైంది!

మాధవి బంధువులు వచ్చినరోజు అమ్మ... బాగా బాధపడింది.

'నువ్వు కాలేజిలో చేరకుండా మీ నాన్న అనారోగ్యం అడ్డు తగిలింది! ఇపుడు నీ పెళ్ళి జరిగేవేళకి... నేనిలా మంచాన పడాల్సి వచ్చింది! నీకు... ఏదో శాపం తగిలినట్లు... ఇలా జరగటం ఏమిటిరా...' అంటూ అమ్మ బాధపడింది.

ఆ తరువాత విషయం తెలిసి చూడటానికని వచ్చిన బంధువుల దగ్గరా అమ్మ తన బాధని ఇలాగే వ్యక్తపరిచింది.

అందుకేనేమో... మాధవి ఇలాంటి నిర్ణయం తీసుకుందని అనుకున్నాను.

అమ్మ మంచం మీద పడుకున్న మందుగదిలోనే రెండు పీటలు వేసి, పెళ్ళికని వాళ్ళు తీసుకువచ్చిన సరంజామానంతా సర్దేశారు.

కొందరు వంటల ప్రయత్నం మెదలుపెట్టారు.

మంచం మీదున్న అమ్మ మొహంలో దిగులు చెరిగిపోయి చిన్నపాటి సంతోషం చోటు చేసుకుంది!

ఆ పదిమంది సమక్షంలో మా పెళ్ళి జరిగిపోయింది!

తర్వాత మేమిద్దరం అమ్మ మంచానికి చెరోవేపు కూర్చుని విందు భోజనాన్ని తినిపించాం. తనకి చాలా సంతృప్తిగా, సంతోషంగా ఉందంటూ మమ్మల్ని పదే పదే దీవించింది...!

మేం శాపం తగిలిందని బాధపడిన పరిస్థితుల్ని... మాధవి తన రాకతో, వరంలా మార్చేసిందని నేనూ ఆనందించాను...!

పెళ్ళి చూపుల తతంగం దగ్గర్నుండీ, పెళ్ళి తంతు వరకూ మాదంతా వైవిధ్యమే...! మా ఊళ్ళో జనానికి కొన్నాళ్ళు చెప్పుకోవటానికి తగిన మేటర్ ఇచ్చామంటూ మేం ఇద్దరం సరదాగా నవ్వుకున్నాం...!

ఇంటిపనులు గురించి బెంగ లేకుండా మాధవి బాధ్యత తీసుకుంది. అమ్మ నిశ్చింతగా ఉంది...! మంచం మీద నుండే అదీ, ఇదీ అంటూ కేకలు పెట్టేపని అమ్మకు తగ్గింది! నాకైతే కష్టకాలంలో ఆదుకున్న దేవతలాగే అనిపించింది.

అలా ఉల్లాసంగానే రోజులు పరుగులు పెడుతున్నట్లుగానే గడిచిపోతున్నాయి! పెళ్ళి రోజు అని ముందుగా అనుకున్న తేదీన కొద్దిమంది దగ్గర బంధువులకి భోజనాలు పెట్టాం. మాధవీ వాళ్ళ ఊరునుండి చాలా కొద్దిమంది వచ్చారు.

అలా అట్టహాసం, ఆడంబరం లేకుండా, మా ఇద్దరికీ ఇష్టమైన విధంగా మా పెళ్ళి జరిగిపోయింది.

ఒకరోజు మేమిద్దరం నరసింహంగారి దగ్గరకు వెళ్ళి ఆశీస్సులు తీసుకుని వచ్చాం. అప్పుడప్పుడూ వెళ్ళి, ఊరి విశేషాలు చెబుతూ, అవసరమైనప్పుడు రెండు రోజులు ఉండి చేయాల్సినవి ఏమైనా ఉంటే... చూసి వస్తున్నాను.

ఒకరోజు... ఊరి పొలిమేర దగ్గరకు బండి తీసుకుని వచ్చి ఉండమని నరసింహంగారి దగ్గర్నుండి కబురు వస్తే... ఎందుకో ఏమిటో అర్థం కాకపోయినా బండి తీసుకుని వెళ్లాను. అంతకు ముందు అక్కడికి వెళ్ళినప్పుడు ఇంట్లో... ఒక విషయంగా ఘర్షణ జరుగుతోందని నాకు తెలుసు.

ఒక ప్రాజెక్టుపై సంతకం చేయటానికి నరసింహంగారు నిరాకరించారు. అమ్మగారు 'ఫరవాలేదు... పెట్టేయ్యండి. రూల్సు అంటూ చాదస్తం పెట్టుకోకండి. ఏమైనా తేడా వస్తే మావాళ్ళు చూసుకోగలరు. మీ మీదకు ఎటువంటి ఆరోపణా ఉండదు...' అంటూ ఎంత నచ్చచెప్పినా వారు అంగీకరించలేదు.

అమ్మగారి బంధువర్గం, కొడుకు, అమ్మగారు, అందరూ ఒక్కటిగా నరసింహంగారిపై ఒత్తిడి పెంచారు.

చివరకు అలా చేయటంలో తమకు ఎంత లాభం వస్తుందో వివరించారు కూడా. దాంతో నరసింహంగారు మరింత మొండికేసి... చివరకు రాజీనామా ఆలోచనలో ఉన్నట్లుగా చెప్పారు. ఇంతవరకే నాకు తెలిసింది. ఆ తర్వాత ఏమై ఉంటుందో తెలియదు. నా రాక నరసింహంగారికి తప్ప ఆ ఇంట్లో వారికి ఇష్టం ఉండటం లేదని తెలిసాక, నేను అప్పుడప్పుడూ

కూడా వెళ్ళటం క్రమేపి తగ్గించు కుంటున్నా. పైగా నా రాకపోకల వల్ల ఇంటివారితో నరసింహంగారికి ఇబ్బందికరమేగానీ, వేరే ప్రయోజనం ఉండదని నేనూ గ్రహించి... దూరంగా ఉండటమే నాకూ గౌరవప్రదమని తెలుసుకున్నాను.

ఆరోజు... మరి... నన్ను బండి తీసుకురమ్మని ఎందుకు కబురు చేశారోననే ఆలోచనతో ఎదురుచూస్తుండగా... కారు వచ్చి ఆగింది. అందులో నుండి నరసింహంగారు మెల్లగా దిగివచ్చారు. బండి నా చేయి ఆసరాతో ఎక్కి కూర్చుని 'నువ్వే తోలవయ్యా, చేతనవునా..' అని అడగటంతో, నేను వచ్చునంటూ తలవూపి వెంకన్నను వెళ్ళిపొమ్మని చెప్పాను.

ఇంటికి కారులో వెళ్ళటం కంటే... ఎడ్ల బండి మీద వెళ్ళాలనే కోరిక కలిగిందని చెప్పారు.

'నాకు తొందర ఏం లేదు... నిదానంగా పోనియ్యి... మన ఊరంతా చూసుకుంటూ వెళ్దాం...' అన్నారు. ఏం జరిగిందని నేను అడిగిన ప్రశ్నకు... నాకు కొంచెం దగ్గరగా జరిగి చెప్పారు. 'నీతో చాలా విషయాలు పంచుకోవాలి. ఇంటికి వెళ్ళాక తీరుబడిగా చెప్పుకుందాం... క్లుప్తంగా ఏమి జరిగిందో ఇప్పుడు చెబుతా...!' అన్నారు.

నాకు చాలావరకు తెలిసిందే, మిగతాదీ తెలిసింది.

'రాజకీయాలలోకి అవినీతి భూతం ప్రవేశించింది. క్రమ క్రమంగా అందరూ దానికి ఆహారంగా మారిపోతున్నారు. ఎవరైనా నాలాంటివాళ్ళు ఎదిరిస్తే... చాదస్తం పెరిగిందంటున్నారు. పోరాటానికి యువకులే సిద్ధమవాలి! నాలాంటి వాళ్ళకు శక్తి చాలటం లేదు!

'ఓడిపోయినట్లు... ఊరికి ఏం మొహం పెట్టుకుని వెళ్తారు...? ఈ పని చేయకపోతే, మీ పదవే వూడిపోతుందన్నది మీకు తెలుసా...?' అంటూ ఆవిడ భయపెట్టాలని చూసింది.

అవినీతికి తెలిసి లొంగిపోయేకంటే..అపజయాన్ని అంగీకరించటమే మేలనుకున్నాను! అందుకే....పదవి పోతుందనే భయం లేకుండా ముందుగా నేనే రాజీనామా చేసేసాను! ఆవిడేమో చాలా బాధపడిందిగానీ...నాకు మాత్రం బాధ కించిత్తు కూడా లేదు! నిజం చెప్పాలంటే.... చాలా సుఖంగా ఉంది ప్రాణానికి. ఈ పదవి వల్ల మన ఊరికి ఎన్నో చేయగలుగుతాననుకున్నా. నావి భ్రమలే అన్న విషయం తొందరలోనే తెలిసివచ్చింది. పదవన్నది వ్యక్తిగతంగా సంపాదించుకోవటానికి పనికి వస్తుందేమో గానీ, ప్రజల కోసం ఏం చేయాలనుకున్నా కనిపించని సంకెళ్ళులా ఎన్నో విషయాలు, ఎందరో మనుష్యులు అడ్డం వస్తారు. ప్రజల క్షేమం కంటే, పార్టీ ప్రయోజనాలు, పదవిని నిలుపుకోగలగటమే ముఖ్యం అయి కూర్చుంటుంది! ఈ విషయం గ్రహింపుకు వచ్చాక నాకు పదవిని వదులుకోగలిగే తెగింపు వచ్చేసింది! అర్థమైందా...?' అనడిగారు.

'మరి అమ్మగారు...?' అంటూ నసిగాను.

చిన్నగా నవ్వారు. 'మామూలే... ఇష్టమైనప్పుడు వచ్చి వెళ్తారు. లేకపోతే అదీ ఉండకపోవచ్చు చూద్దాంలే...' అనేసారు.

ఆ తర్వాత... అప్పుడప్పుడూ వెళ్ళి కలుస్తున్నపుడు... అక్కడి విషయాలన్నీ సందర్భాన్ని

బట్టి చెబుతూండేవారు. పదవిలో ఉండి ఎన్ని రకాలుగా ఒత్తిడి అనుభవించారో, ఆ అనుభవాల్ని విన్నాక నాకు అర్థమైంది.

మా ఊరుకు వచ్చేసాక, మునుపటిలా ప్రశాంతంగా కనుపిస్తున్నారు కానీ, ఆరోగ్యం కొంచెం సన్నగిల్లిందనే విషయం తెలుస్తోంది! ఊరి విషయాల్లో కల్పించుకోవటమూ తగ్గింది. ఎక్కువగా ఇంట్లోనే కాలక్షేపం చేస్తున్నారు.

నేను నరసింహంగారి పనులు ఏవైనా ఉంటే చక్కబెట్టటంతో పాటూ కౌలుకి ఇచ్చేసిన వారి పొలాలను పర్యవేక్షించటంతో, మావీ చూసుకోవటం చేస్తున్నాను.

వ్యవసాయం పెరిగింది... పాల వ్యాపారం తగ్గింది.

అమ్మకీ ఓపిక తగ్గింది. అందుకని పాడి పశువుల్ని పరిమితం చేయటమే మంచిదనిపించింది!

వెంట వెంటనే ఇద్దరు పిల్లలూ మా మధ్యకి వచ్చారు. మనవల ఆటపాటలతో అమ్మకు మంచి కాలక్షేపం... మాధవికి మాత్రం రోజంతా పని హడావుడే. అలా ఉండటమే తనికి ఇష్టమని అంటూండేది! పైగా సాయంకాలం ఖాళీగా ఉండటం కంటే... ఏదో కాలక్షేపం కావాలంటూ పదిమంది పిల్లల్ని చేరదీసి చదువు చెప్పటం మొదలుపెట్టింది.

కాసేపయినా ఖాళీగా ఉండటం ఇష్టం ఉండదంటూ ఏవేవో పనులు చేస్తూండటంతో, అమ్మ మాధవిని మెచ్చుకుంటూండేది... 'నాకోడలు బంగారం' అంటూ.

పిల్లలకు చదువు చెప్పాలనే తన ఆలోచన నాకూ బాగా నచ్చింది.

పైగా అలా పిల్లలు మా ఇంటికి వచ్చి చదువుకుంటూంటే, ఆ వాతావరణం వలన మా పిల్లలకూ చదువుపట్ల శ్రద్ధ కలుగుతుందని మాధవి తన అభిప్రాయంగా చెప్పినప్పుడు... నాకు అప్రయత్నంగా నాన్న మాటలు గుర్తుకు వచ్చాయి...! మా నాన్నా అంతే... నరసింహంగారి ఇంట్లో కూర్చుని చదువుకోవటంతో అలాంటి ప్రయోజనమే కలుగుతుందని ఆశించాడు. ఇపుడు మాధవి మా ఇంటికీ ఆ కళ తీసుకురాగలిగింది...!

ఆ రోజు.... నన్ను రమ్మని నరసింహంగారు కబురు పెట్టారు.

నా పనులన్నీ పక్కన పెట్టేసి పరుగున వెళ్ళాను. ఈ మధ్యలో కొంచెం బలహీనంగా కనుపిస్తున్న మాట నిజమే అయినా, ఆ రోజు మాత్రం... బాగా నీరసంగా, తేడాగా కనిపించటంతో కొంచెం కంగారుపడుతూ ఆరోగ్యం గురించి వాకబుచేశాను.

ఏం లేదంటూ, కాసేపు దగ్గిర కూర్చుంటావని పిలిపించానని చెప్పారు. ఏవో విషయాలు మెల్లగా చెబుతూనే కాసేపటికి నన్ను పరీక్షగా చూసి... 'రాఘవా... నువ్వెప్పుడు వచ్చావు...?' అనగానే, నేను ఉలిక్కిపడ్డాను! అంతేకాదు అప్రయత్నంగా అచ్చం మానాన్న వారిని పిలిచినట్లు 'అయ్యా...' అనేశాను! ఒక క్షణానికే తేరుకుని... స్పృహలోకి వచ్చినట్లు సర్దుకుంటూ "ఏమిటండీ, అలా పిలిచారూ...?" అనడిగా.

నరసింహంగారు స్నేహితుడు, సమవయస్కుడే అయినా మామూలుగా పిలవమని అన్నా మా నాన్న వినిపించుకునేవాడు కాదుగా. 'అయ్యా' అనటమే తనకు సౌకర్యంగా ఉంటుందనేవాడు... స్థాయిని బట్టే అనుకుంటా.

వెంటనే నరసింహంగారూ మామూలయి... 'ఒక క్షణం ఏమిటో అయింది నాకు. నీలో రాఘవ కనుపించాడు' అంటూ రెండు నిముషాలు కళ్ళు మూసుకుని మౌనంగా ఉండి పోయారు.

'నీకో విషయం చెప్పాలి. ఎందుకనో గానీ ఆవిడ తొందరలోనే ఇక్కడకు వస్తారని అనిపిస్తోంది! ఒక ఉత్తరం రాసాను. డ్రాయరుపై ఉంది. చదివి కవరు అతికించి సొరుగులో పెట్టేసేయ్. వచ్చినపుడు జాగ్రత్తగా అందించు... మరిచిపోకు..' అన్నారు.

'అదేంటండీ... వచ్చినప్పుడు మీరే ఇవ్వొచ్చుగా... పైగా నేను చదివి, ఇవ్వటం ఏమిటీ...?' అయోమయంగా చూస్తూ అడిగాను.

"నువ్వు చదివితే నా మనసేమిటో, నీకూ కొంచెం అర్ధమౌతుందని! ఏం తెలుసుకోవటం ఇష్టం లేదా...?' అన్నారు.

'అది కాదండీ' అంటూ నసిగాను... విషయం ఏమిటో అర్థంకానట్లుగా అనిపించింది! 'నేనే ఇవ్వొచ్చు... కానీ, ఆవిడ ఎప్పుడొస్తుందో, తెలియదు. ఆ సమయానికి నేను మెలకువగా ఉంటానో, లేదో... అంటే, అదేనోయ్... నిద్రపోతున్నాననుకో... వెంటనే వెళ్ళిపోతుందనుకో... అప్పుడెలా...? అందుకే నేను చెప్పాలని అనుకున్న నాలుగు మాటలూ రాసి ఉంచానన్నమాట! ఎదురు ప్రశ్నలు మానేసి... చిన్నవాడివి... నేను చెప్పినట్లు చేయి. నాకు కొంచెం అలసటగా ఉంది. కాసేపు నిద్రపోతాను. నువ్వు చదివాక... సరిగా వింటున్నావా, చదివాక మాత్రమే ఆ కవరును అంటించి డ్రాయరు లోపల పెట్టేసి వెళ్ళు. అదే... వెళ్ళిరా... నాకు చెప్పనవసరం లేదు... చెప్పాగా బాగా నిద్రొస్తోందని...!'

వెంటనే అటుపక్కకు ఒత్తిగిల్లారు.

నేనూ ఇక చేసేదేం లేక... పక్కగదిలోకి అడుగులు వేసాను.

కవరులోని కాగితాల్ని తీసి చదవబోయాను. అప్రయత్నంగా చేతులు వణికాయి.

ఏం రాసి ఉంటారనే ఆలోచనతో గుండెలు దడదడలాడాయి!

'శుభా...'

ఆ అక్షరాల్ని చదవగానే నేనెందుకూ చదవడం అనుకుంటూ ఆగిపోయాను. చదవమని కొంచెం ఆజ్ఞలాగే చెప్పారు కదా... ఏం రాసారో తెలుసుకోవాలంటే... చదవాల్సిందేనని నిర్ణయించుకుని మళ్ళీ మొదలు పెట్టా.

'శుభా...

నిన్ను ఇలా పిలవాలని అనుకున్నాగానీ 'సుబ్బు' అనే పిలుపు అప్రయత్నంగా వచ్చేసేది... అంతేగానీ నిన్ను బాధపెట్టాలనే ఆలోచనతో కాదు. వెక్కిరిస్తున్నానేమోననే అనుమానంతో కాబోలు... నీకు కోపమూ, రోషమూ వచ్చేసేవి! సుబ్బూ అంటే ఏదో ఆత్మీయత కలుగుతున్నట్లనిపించేది! శుభా... అనేది నువ్వు... పెద్దల పెట్టిన పేరుని కాదని పెట్టుకున్న పేరని తెలియటం వలనే... నాకు కృత్రిమంగా తోచేది కాబోలు! అంతే... సుమా!

ఇపుడు మాత్రం... నీ కిష్టమైన విధంగానే మనఃస్ఫూర్తిగా పిలుస్తున్నాన్నది నిజం! అవును... నీ కిష్టమని అర్థం చేసుకున్నప్పుడు... నేనెందుకు నీకు ఆనందం కలిగించాలని

ఆలోచించలేకపోయానని ఇప్పుడు అనిపిస్తోంది! నాది నిజంగా తప్పే...!

ఇవాళెందుకో... ఖాళీగా కూర్చుని ఆలోచిస్తుంటే... కొన్ని విషయాల్లో నా తప్పులే ఎక్కువగా కనుపిస్తున్నాయి! మన దారులు, అభిరుచులు వేరువేరు అనుకుంటూ మనం వేర్వేరుగా ప్రయాణాలు సాగించామేగానీ, ఒకరి దారిలోకి మరొకరు వెళ్ళే ప్రయత్నం మాత్రం చేయలేకపోయాం! అంటే... అహం అనేది మన ఇద్దరిలో సమానంగానే ఉందని అర్థమౌతోంది కదూ...? నేనయినా సర్దుబాటు మనస్తత్వంతో ఆ ప్రయత్నం చేయకపోవటం గాదు.. చేయలేకపోవటం నా అశక్తతేనని ఒప్పుకుని, క్షమాపణ కోరాలనీ అనుకున్నందునే ఇప్పుడు ఈ ఉత్తరం రాస్తున్నాను. అర్థమైందా...?

నేను పూర్తిగా... ప్రయత్నించకపోవటమన్నది కూడా నిజం కాదు! నిన్నయినా ఆనందింపచేద్దామనేగా, రాజకీయాల్లోకి వచ్చానూ...! ఊరి వాళ్ళందరకూ కావల్సిన పనులు చేసిపెడుతూ ఆనందాన్ని ఇస్తున్నప్పుడు, నీకు సంతోషం కలిగిద్దామనే పదవిని అంగీకరించాను. ఆ పైన ఊరుకు అధికారికంగా, ఇంకెన్నో ప్రయోజనాలు చేకూర్చవచ్చని కూడా అనుకున్నది నిజమే...! కానీ ఆ విషయాల్లో సఫలీకృతం కాలేకపోయాను!

అవును... హంగు... ఆర్భాటాలూ నచ్చకపోయినా నీకోసమే సర్దుకున్నాను! నాది కాదనిపించే ప్రపంచంలో బ్రతకటానికి సిద్ధపడ్డాను, కొంచెం సౌకర్యంగా అనిపించిందల్లా రాఘవ కొడుకు నా వెంట ఉండటానికి అంగీకరించటమే...! అది నిజం...! నిత్యమూ నా వెన్నంటి ఉన్నాడు కాబట్టే నేనావూళ్ళో ఉండగలిగాను. అభిమానాలు అంతరంగాల్లో లేకపోయినా పైపై పూతలా వేసుకుని ఆడంబరంగా తిరిగే... నీ వాళ్ళనుకునే మనుష్యుల మధ్య... సహనంతో కాలం గడిపాను!

నువ్వనుకుంటున్నట్లుగా వాళ్ళంతా నీ బంధుమిత్రులు కాదు... అధికారం, ఐశ్వర్యం లేకపోతే... నీ స్నేహం అవసరం లేదు. అది నీకూ తెలిసే ఉంటుంది! అయినా, వాళ్ళందర్నీ నీ చుట్టూ తిప్పుకోగలగటం గెలుపులా నీకు ఆనందాన్ని కలిగిస్తూ ఉండొచ్చు... అందుకే పదవిని నిలుపుకోవాలనే తాపత్రయం చూపించేదానివి! అవునా...? ఆలోచించు... మన సుఖాల్లోనే పాలు పంచుకునేవాళ్ళు... మనల్ని నిజంగా అభిమానించే వాళ్ళుకాదు... వాళ్ళ అవసరాలు వాళ్ళవి. మన కష్టాల్లోనూ మన వెంట నడవటానికి సిద్ధపడేవాళ్ళే మన హితులు... స్నేహితులు... అని మన పెద్దవాళ్ళెప్పుడో చెప్పారు. అది అర్థం చేసుకోగలిగితే, మనలోని లోపాల్నీ వేలెత్తి చూపించే వాళ్ళని దూరంగా పెట్టాలనుకోం!

నాకు పి.ఏ.గా పెట్టిన... మీ బంధువు గిరీష్ ఒకసారి నీతో చెప్పటం నేనూ విన్నాను.

"పదవి దక్కటం అంటే... పండుగ నట్టింట్లోకి వచ్చినట్లే కాబట్టి... ఆ సందడీ, సంరంభం... ఆనందించటం తెలియకపోయిన వాళ్ళకు పండుగలు ఎందుకూ... దండుగే' అన్నాడు. నా తీరుని దృష్టిలో పెట్టుకునే కాబోలు!

ఇంకొకసారి ఇంకోరకంగా జ్ఞాన బోధ చేశాడు 'డాక్టర్లు ఉచితంగా వైద్యం చేయాలని అనుకోరు. ఫీజు తీసుకుంటే తప్పు పట్టం... అలాగే లాయర్లు గానీ, ఇంకేరకం వృత్తి వాళ్ళయినా చేసిన పనికి... ప్రతిఫలం తీసుకుంటారు.అలాంటప్పుడు రాజకీయ నాయకులు మాత్రం

ఉచితంగా అన్ని పనులూ చేయటం దేనికీ... ఈ పదవి ఊరికే రాదుగా, చాలా ఖర్చుపెట్టి దక్కించుకునేది కదా...!'

నిజమే... ఇవన్నీ ఇప్పుడు అందరినోటా వింటున్నవే... అందుకే ఎవరికీ తప్పు అనిపించటం లేదు... నిజమేగా అనుకుంటున్నారు. నాలాంటి వాళ్ళకి... లంచం తీసుకోవటం సమంజసమేనని చెప్పే ప్రయత్నంగా భావిస్తారు! నా విషయంలో అదే జరిగింది!

ఓడిపోయి పారిపోవటంలా నా రాజీనామా నీకనిపించింది! తిరిగి నాకు నచ్చిన నా ఇంటికి రాగలగటం... నాకు ఓదార్పుగా అనిపించింది!

అయితే... దోచుకోగలిగినంత దక్కించుకోవాలని మాత్రమే భావించే నిజాయితీలేని ఆ రాబందుల్లాంటి బంధువుల మధ్య నిన్ను వదిలి వచ్చెయ్యాల్సివచ్చిందే... అనే ఆలోచనే నన్నిప్పుడు వేదనకు గురిచేస్తోంది!

నిజాయితీ లేని ఏ వృత్తి, వ్యాపారామూ మనకి నిజమైన ఆనందం కలిగించదు! ఇది నా ఉద్దేశ్యం! అందుకే... ప్రజాసేవ అనే ముసుగు తీసేసి రాజకీయాలూ వ్యాపారమేనని నాయకులు అంగీకరించగలిగితే... నాలాంటి వాళ్ళతో ఘర్షణ ఉండదు! చేతల్లో... అలాగే చూపిస్తున్నారుగానీ... మాటల్లో మాత్రం బయటపడటం లేదు! నిజాయితీ లేకపోవటం వలనే!

మన అబ్బాయిని రాజకీయాల్లోకి రమ్మని ఒత్తిడి చేయకు. ఎవరైనా మనసుకు నచ్చిన దారిలోనే వెళ్ళి ప్రయోజకులయ్యే ప్రయత్నం చేయాలి! అప్పుడే ఫలిస్తుంది! ఇది కేవలం నా సలహా మాత్రమే!

రాఘవ కొడుక్కి నేనిచ్చే సూచన ఇదే! తనని పేరుతో కంటే..నా స్నేహితుడి కొడుకుగా గుర్తించటమే నాకిష్టం! అందుకే...అతని పేరుతో ఎప్పుడోగానీ పిలవను! మీ నాన్న వారసత్వంగా వచ్చిందని పాల వ్యాపారామో, వ్యవసాయమో చేయాలని అనుకోకు. నీ ముందున్న దారుల్లో... ఏది నీకు నచ్చిందో... సంతోషాన్ని కలిగిస్తుందనే నమ్మకం కుదురుతుందో, ఆ మార్గాన్నే ఎంచుకుని సాగిపో...! ఇదే అతనికి నేను గురువుగా ఇచ్చే సలహా...!' అని నా మాటగా చెప్పు.

శుభా... నేను చిన్నప్పటినుండీ... ఎదిగే కొద్దీ ఒదిగి ఉండాలనే పెద్దల మాటను వంటబట్టించుకున్న తల్లిదండ్రుల పెంపకంలో పెరిగినవాడిని! ఒదిగి ఉండాలనుకునేవాళ్ళు కష్టపడి ఎదగటమెందుకూ... అనే భావన నీది!

ఎవరి మనస్తత్వానికి ఏది సరిపోతుందో... అదే కరెక్టనుకుంటారు ఎవరైనా!

అందుకే... నీకు నేను ఈ వయసులో చెప్పాలనుకుంటున్నదేమిటంటే... నీకు చేయాల్సినంత న్యాయం నేను చేయలేకపోయానేమోననిపిస్తోంది! నేను నీకు చేయాలను కున్నది... చేయలేకపోయానేమోగానీ... చేయాలని అనుకోకపోవటం వలన మాత్రం కాదని అర్థం చేసుకుని మన్నించమని కోరుతున్నాను!

తప్పు చేశానేమోననే సందేహమైనా వస్తే... అంగీకరించి క్షమాపణ కోరాల్సిందే కదూ..! ఇప్పటికైనా నీవాళ్ళమీద, నీ కొడుకు మీద భరోసా పెట్టుకుని కాకుండా... నీకు నచ్చిన మార్గంలో నిశ్చింతగా ఉండు! నీకేలోటూ లేని విధంగా ఏర్పాట్లున్నాయి...!

ఇంకొకమాట! నీకు ఏ సహాయమైనా కావాల్సి వచ్చినప్పుడు... ఎక్కువ తక్కువల భేషజం లేకుండా... ఆవుల రాఘవ కొడుకుకి కబురు పంపు. నీకు సంతోషంగా సాయ పడగలడని నమ్మకంగా చెప్పగలను! వాడు చిన్నప్పటినుండీ పశువల మధ్య పెరిగిన వాడవటం వలనో, ఏమో చెప్పలేను గానీ, ఎటువంటి ప్రతిఫలమూ ఆశించకుండా ఇవ్వటమనే మంచి లక్షణాన్ని ఆ పశువుల నుండే నేర్చుకున్నాడేమో...!

చెట్టూ చేమా నుండి మనం నేర్చుకోవాల్సిందీ ఇదేనని పెద్దల మాట ఈ క్షణంలో గుర్తుకొచ్చి రాస్తున్నాను.

నేను నేర్చుకున్న జీవిత పాఠాన్ని మీకూ... అంటే... నీకూ, మనబ్బాయికీ, రాఘవ కొడుకుకీ కలిపి అన్నమాట... చెప్పాలనే తపనతో ఈ ఉత్తరాన్ని రాస్తున్నాను.

ఆశీస్సులతో...

రాఘవ స్నేహితుడైన నరసింహమూర్తి.

ఆ ఉత్తరం చదువుతూంటే... నాకు తెలియకుండానే కన్నీళ్ళు ధారలు కట్టేసాయ్...! ఇదేమిటి... చివరి మాటలా ఇలా రాసారేమిటీ... ఏడుపు ముంచుకొచ్చింది! పరుగున పక్క గదిలోకి వెళ్ళాను. నిద్రలో ఉన్నారని తెలిసి... ఆ ఉత్తరాన్ని డ్రాయరు సొరుగులో భద్రపరిచి.. దుఃఖాన్ని దిగమింగుకుంటూ ఇంటిదారి పట్టాను.

నాన్నని స్నేహితుడిగా భావించి... మనసులో ఎంతటి ఉన్నతమైన స్థానాన్ని ఇచ్చారో... నాకూ అంతటి ఆదరాన్నీ, అభిమానాన్నీ అందించారు నరసింహమూర్తిగారు! ఆ ఉత్తరంలోని మాటల్నే గుర్తు చేసుకుంటూ గడిపానా రోజు.

ఆ మరునాడే ఆయన మరి లేరనే వార్త చేరింది!

ఎప్పుడో మరణించిన మా నాన్న ఆ రోజే గతించినట్లుగా దుఃఖం కలిగింది!

***